www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 7 డిసెంబర్ 2024

5

ఏలూరు

విద్యార్థులకు నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యార్థి దశనుంచే నేరాల పట్ల అవగాహన ఉండాలని, నేరాలు చేసే వారి పట్ల ఏ విధంగా వ్యవహరించాలన్న కనీస సమాచారం కలిగి ఉండాలని ఏలూరు రెండో పట్టణ ఎస్ఐ నాగ కళ్యాణి అన్నారు. ఏలూరు నగరంలోని అశోక్ నగర్ ప్రాంతంలో ఉన్న ఎస్‌ఎంబిటిబి కళాశాలలో నేరాలపై అవగాహన అనే కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో అంతర్జాలంలో పరిచయం పెను ప్రమాదానికి దారి తీస్తుందని కూడా ఆమె వారిని హెచ్చరించారు. ఎవరైనా ప్రమాదంలో ఉన్నట్లయితే 112 నెంబరుకు సమాచారం ఇస్తే అతి తక్కువ సమయంలో పోలీసులు తమ వద్దకు చేరి తమ సమస్యలను పరిష్కరిస్తారని వారికి సూచించారు.

చంద్రన్న బీ(భీ)మా ఏదీ..?

ఆరు నెలలైనా అమల్లోకి రాని చంద్రన్న బీమా పథకం

గత మార్చి నుంచి ప్రమాద, సాధారణ మరణాలకు అందని బీమా

రెండు జిల్లాల్లో దాదాపు రెండు వేలకుపైగా బాధిత కుటుంబాలు ఎదురుచూపు

ప్రమాద బీమా రూ.పది లక్షలు, సాధారణ మరణాలకు రూ.5 లక్షలు అంటూ కూటమి హామీ

సచివాలయాల చుట్టూ బాధిత కుటుంబాలు ప్రదక్షిణలు

పేదలకు అత్యంత ముఖ్యమైన పథకం నిర్లక్ష్యంపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య కుటుంబాలకు అండగా ఉండాల్సిన చంద్రన్న బీమా అమలుకి నోచుకోని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా పేద కుటుంబాలకు అండగా నిలిచే చంద్రన్న బీమా అమలుపై కూటమి సర్కార్ నోరు మెదపడం లేదు. దీంతో ఇంట్లో కుటుంబ పెద్దను కోల్పోయిన వేలాది కుటుంబాలు చంద్రన్న బీమా కోసం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదని సచివాలయ అధికారులు ఇస్తున్న సమాధానంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి చంద్రన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంటి పెద్దదిక్కు 50 ఏళ్లలోపు మరణిస్తే సాధారణ మరణాలకు రూ.రెండు లక్షలు, ప్రమాదంలో మృతి చెందితే రూ.ఐదు లక్షలు ఇచ్చేలా చంద్రన్న బీమా అమలు జరిగింది. ఈ పథకంపై అప్పట్లో జనాల నుంచి మంచి ఆదరణ సైతం లభించింది. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి ప్రభుత్వం సైతం పేరు మార్చి వైఎస్ఆర్ బీమా పేరుతో ఈ పథకాన్ని కొనసాగించింది. అయితే సాధారణ మరణాలకు రూ.లక్ష మాత్రమే ఇచ్చింది. ప్రమాద మరణాలకు మాత్రం రూ.ఐదు లక్షల చొప్పున అందించేవారు. గ్రామ సచివాలయాల్లో దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగేది. తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా పథకాన్ని మళ్లీ అమల్లోకి తెస్తామని, సాధారణ మరణాలకు రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణాలకు రూ.పది లక్షలు చొప్పున ఇస్తామని టిడిపి కూటమి తమ ఉమ్మడి మేనిఫెస్టోలో పెట్టింది. ఇంటి పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు ఇది మరింత అండగా ఉంటుందని అంతా భావించారు. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన ఏఒక్క కుటుంబానికీ బీమా అందని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రన్న బీమా అమల్లోకి వస్తుందని ఆశించగా నిరాశే ఎదురైంది.

ఏడాదికి దాదాపు రూ.3 వేల మరణాలు బీమా పరిధిలోకి..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏడాదికి దాదాపుగా మూడు వేల మరణాలు వరకూ బీమా పరిధిలోకి వస్తున్నాయి. గత ఐదేళ్లలో బీమా సొమ్ములు అందించిన వివరాలను పరిశీలిస్తే తేటతెల్లమవుతోంది. జిల్లాల విభజన జరిగిన తర్వాత 2021-22లో ఏలూరు జిల్లాలో సాధారణ మరణాలు 1,692 ఉండగా, ప్రమాద మరణాలు 215 ఉన్నాయి. వైఎస్ఆర్ బీమా కింద 1,550 కుటుంబాలకు సొమ్ము అందింది. 2022-23లో సాధారణ మరణాలు 1,467 ఉండగా, ప్రమాద మృతులు 181 మంది ఉన్నారు. 1,610 కుటుంబాలకు బీమా సొమ్ము అందింది. 2023-24లో సాధారణ మరణాలు 1,492 ఉండగా, ప్రమాద మరణాలు 196గా నమోదయ్యాయి. బీమా సొమ్ము అందుకున్న కుటుంబాలు 1,149 ఉన్నాయి. పశ్చిమలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గత ఐదేళ్ల ప్రకారం చూస్తే ఏడాదికి రెండు జిల్లాల్లో దాదాపుగా మూడు వేల మరణాలు బీమా పరిధిలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. లెక్కల ప్రకారం నెలకు 250 మంది వరకూ సాధారణ, ప్రమాదవశాత్తు మరణిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. మార్చి నుంచి నవంబర్ వరకూ తొమ్మిది నెలల్లో సరాసరిన 2,250 మంది మరణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ ఏఒక్క కుటుంబానికీ చంద్రన్న బీమా అందలేదు. చంద్రన్న బీమా ఆన్‌లైన్ ప్రక్రియను కూడా ప్రభుత్వం ప్రారంభించ లేదు. ఎన్నో పేద కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి దిక్కులేక విలవిల్లాడుతున్నాయి. వైద్యఖర్చుల కింద చేసిన అప్పులు వెంటాడుతున్నాయి. ఆదాయం లేక, అప్పుల బాధ తట్టుకోలేక ఎన్నో కుటుంబాలు నలిగిపోతున్నాయి. చంద్రన్న బీమా సామాన్య ప్రజానీకానికి అత్యంత అవసరమైన పథకం. అలాంటి పథకం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేయాలనే డిమాండ్ పెద్దఎత్తున వినిపిస్తోంది.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ఆహ్వానం

జిల్లాలోని 1788 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు

కలెక్టర్ వెట్రిసెల్వి

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న గురుకుల విద్యార్థిని, సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 7న జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఏర్పాట్లను ఆమె మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యాప్రమాణాల స్థాయి మెరుగుపరిచే నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన, అవసరమైన చర్యలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించుకోవడానికి 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం' నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో 1788 ప్రాథమిక, ఉన్నత, రెసిడెన్షియల్, గిరిజన ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటన్నిటిలోనూ ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులను, దాతలను తదితరులను సమావేశానికి స్వాగతం పలుకుతారన్నారు. అనంతరం విద్యార్థుల సమగ్ర ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించడం, విద్యా ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులతో చర్చించడం వంటివి చేస్తారన్నారు. ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చిస్తారన్నారు. సైబర్ నేరాలపై అవగాహన, పూర్వ విద్యార్థుల విజయగాథలు, అతిథుల ప్రసంగాలు,ఆహ్వానితులచే అభిప్రాయ సేకరణ ఉంటాయన్నారు. అనంతరం అందరూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో సహపంక్తి భోజనం చేస్తారన్నారు. 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం' ఆహ్వాన పత్రికలు విద్యార్థులే స్వయంగా తయారు చేసి తల్లిదండ్రులకు అందజేస్తున్నారన్నారు. 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం' ఒక పండుగ వాతావరణంలో ఆత్మీయ సమావేశంలా నిర్వహించి, పాల్గొన్న ప్రతిఒక్కరికీ మధుర స్మృతిలా నిలిచేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పాఠశాలలను గుర్తించి, ఆయా పాఠశాలల్లోని అందరు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, వారికి హెల్త్ కార్డులు అందిస్తామని తెలిపారు. పాఠశాలలోని విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో సమగ్ర విద్యా ప్రగతి పత్రాలు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి రాజకీయ ప్రమేయమూ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన బ్యాక్‌డ్రాప్‌లు మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానపత్రం అందించిన గురుకుల పాఠశాల విద్యార్థులు

మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమానికి విచ్చేయాలని వట్లూరు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సిబ్బంది కలెక్టర్ వెట్రిసెల్వికి ఆహ్వానపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.మేరీ ఝాన్సీ రాణి, పెదపాడు ఎంఇఒ డివి.రమణ, ఉపాధ్యాయురాలు బి.చైతన్య, విద్యార్థిని బి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ హబ్‌గా నూజివీడు

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడును సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో శుక్రవారం పారాబోలా-9 ఇంక్యుబేషన్ ల్యాబ్ కేంద్రాన్ని మంత్రి పార్థసారథి, ఆయన కుమారుడు కొలుసు నితిన్ కృష్ణ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు ట్రిపుల్ ఐటి ద్వారా ప్రతిభావంతులైన ఎంతోమంది గ్రామీణ పేద విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన సాంకేతిక విద్యను అందించి సాఫ్ట్‌వేర్ నిపుణులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటిని దేశంలోనే నెంబర్ వన్ విద్యాసంస్థగా తీర్చిదిద్దడంతోపాటు నూజివీడు ప్రాంతాన్ని సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో విద్య అభ్యసించిన విద్యార్థులు ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల్లోనూ సాఫ్ట్‌వేర్ నిపుణులుగా సేవలందిస్తున్నారన్నారు. ఈ సంస్థ ద్వారా ప్రస్తుతం 23 మంది విద్యార్థులకు నైపుణ్యం కలిగిన బోధకులతో మంచి సాంకేతిక విద్యను అందిస్తున్నారని, దీన్ని ప్రతిఒక్క విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ఈ ఇనిస్టిట్యూట్ నడపాలని ప్రొఫెసర్స్‌కు మంత్రి సూచించారు. ఈ సంస్థలో ఇటీవల కొన్ని సమస్యలు వచ్చాయని, వాటిని పరిష్కరించి విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు, విద్యా బోధనా అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో ఒక క్రికెట్ స్టేడియం నిర్మిస్తానని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తానని, సోలార్ విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధ్యాపకులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో స్టార్టప్ సెంటర్‌ను స్థాపించాలనే ఉద్దేశంతో గత అక్టోబర్‌లో యుఎస్ఎ ఆధారిత సంస్థ అయిన పారాబోలా9తో అవగాహనా ఒప్పందంపై సంతకం చేసిందన్నారు. ఈ సంస్థ నూజివీడు క్యాంపస్‌ను సందర్శించి, హ్యాకథాన్‌ను నిర్వహించిందన్నారు. అనంతరం యోగాశాలను ఆయన సందర్శించారు.

మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

అంబేద్కర్‌కు మంత్రి ఘన నివాళి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించి అణగారిన బలహీన వర్గాలకు వెలుగునిచ్చారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి

హోం గార్డుల సేవలు చిరస్మరణీయం

డిఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖలో మిళితమై హోంగార్డులు అందించే సేవలు చిరస్మరణీయమని, పోలీసు సిబ్బందికి వర్తించే అన్ని సదుపాయాలను హోంగార్డు విభాగానికీ అందించేందుకు కృషి చేస్తున్నామని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు మైదానంలో హోంగార్డు 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి అశోక్‌కుమార్‌కు హోంగార్డు ఆర్గనైజేషన్ ఆర్ఐ పవన్‌కుమార్ స్వాగతం పలికారు. అనంతరం హోం గార్డుల నుంచి డిఐజి అశోక్‌కుమార్, ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ జిల్లాలో 404 మంది హోం గార్డులు విధులు నిర్వహిస్తుండగా వారిలో 330 మంది ఏలూరులో, 27 మంది జంగారెడ్డిగూడెంలో, 16 మంది పోలవరంలో, 31 మంది నూజివీడులో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు హోం గార్డు వ్యవస్థ మొదట స్వచ్ఛంద సేవా సంస్థగా ప్రారంభమైనప్పటికీ ప్రస్తుతం పోలీసు శాఖలో మిళితమై వారి సేవలందిస్తున్నారని వివరించారు. ఈ ఏడాది జిల్లాలో 12 మంది హోంగార్డులు ఉద్యోగ విరమణ చేశారని, మరో ఏడుగురు అనారోగ్య కారణాలతో మృత్యువాత పడ్డారని తెలిపారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా రూపంలో రూ.ఐదు లక్షలు అందించిందన్నారు. హోం గార్డులు తమకు కేటాయించిన విధులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆయన సూచించారు. ఇటీవల మృతి చెందిన హోం గార్డు పిఎం కిషోర్‌బాబు కుటుంబానికి రూ.25,950 చెక్కును అందించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన హోం గార్డు విజయసాగర్‌కు రూ.5.29 లక్షల చెక్కును అందించారు. అనంతరం హోం గార్డులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఎఆర్ ఎఎస్‌పి శేఖర్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, పోలీసు అధికారులు మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, సిహెచ్‌జివి.ప్రసాద్‌రావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, భాస్కరరావు, నరేంద్ర, హోంగార్డులు పాల్గొన్నారు.

హోంగార్డులకు ట్రోఫీ అందిస్తున్న డిఐజి

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి - మండవల్లి

తాగునీరు అందించడంలో పంచాయతీ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మహిళలు సచివాలయం వద్ద ఆందోళన చేపట్టిన ఘటన శుక్రవారం మండవల్లిలో చోటుచేసుకుంది. తాగు నీరు అందించకపోతే ఏం తాగాలని కార్యదర్శిని మహిళలు నిలదీయడం గమనార్హం. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లిలోని మూడు తాళ్లపాడు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే ప్రాంతంలో ఉన్న సుమారు 20 కుటుంబాలకు గత 15 రోజులుగా తాగునీరు అందడం లేదు. దీంతో తాము పిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ తాగునీరు అందించకపోవడంపై మహిళలు బిందెలతో నిరసన తెలియచేయగా మంత్రి కొలుసు పార్థసారథి వెంటనే నిధులు మంజూరు చేశారని, తద్వారా పైపులైను వేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ పైపుల గుండా నీళ్లు రాకపోవడంతో గత 15 రోజులుగా దాహార్తితో అల్లాడిపోతున్నామని, అయినప్పటికీ సర్పంచి, కార్యదర్శి పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. తాగునీరు కూడా అందించకపోతే ఇంకేం చేస్తారంటూ సచివాలయంలో మహిళలు కార్యదర్శిని నిలదీశారు. ఇన్‌ఛార్జి కార్యదర్శి సాయిప్రదీప్ మాట్లాడుతూ గత 15 రోజులుగా తాగునీరు రావడం లేదని తన దృష్టికి రాలేదన్నారు. తక్షణం పరిస్థితిని పరిశీలించి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీంతో మహిళలు శాంతించారు.

కార్యదర్శిని నిలదీస్తున్న మహిళలు

ఏకలవ్య గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

54 మంది విద్యార్థులకు చర్మవ్యాధులు, నలుగురుకి సాధారణ జ్వరం

మంచినీటి సరఫరా లేకపోవడమే ప్రధాన కారణం : వైద్యులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని ఇప్పలపాడులోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థిని పట్ల కఠినంగా ప్రవర్తించడంతో విద్యార్థి అనారోగ్యం పాలై బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందిన విషయం తెలిసిందే. ఈ విషయం వార్తాపత్రికలలో రావడం వల్ల వైద్యాధికారులు తక్షణమే స్పందించి శుక్రవారం ఉదయం అంతర్వేది గూడెం పిహెచ్‌సి వైద్యులు మాధురి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో మొత్తం 378 మంది విద్యార్థులు ఉండగా 344 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 344 మంది విద్యార్థులలో 54 మంది విద్యార్థులకు చర్మవ్యాధులు, నలుగురు విద్యార్థులకు సాధారణ జ్వరం ఉన్నట్లు గుర్తించారు. మంచినీటి సరఫరా చేయకపోవడం వల్ల విద్యార్థులు ఈ చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని వైద్యులు ఈ సందర్భంగా తెలియపరిచారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి వి.పెద్దిరాజు ఆధ్వర్యంలో 16 మంది బాలురు, 16 మంది బాలికల గదులలో ఇండోర్ స్పేస్ స్ప్రేయింగ్ చేయించారు. ఎంపిహెచ్ పిఒ ఎస్.శ్రీనివాస్ విద్యార్థులకు ఆరోగ్య విద్యను బోధించడం జరిగింది.

విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తొలగించిన మీటర్లు బిగింపు

కెవిపిఎస్ నాయకుల హర్షం

బుట్టాయగూడెం : తొలగించిన విద్యుత్ మీటర్లు కెవిపిఎస్ పోరాట ఫలితంగా తిరిగి బిగించినట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మల్యాద్రి తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు బాబు జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా 200 యూనిట్స్ లోపు వాడుకుంటున్న లబ్ధిదారులకు 2019లో గత ప్రభుత్వం 91వ జిఒ ఇచ్చింది. అయినప్పటికీ మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో ఎస్‌సి, ఎస్‌టిలకు బకాయిలు ఉన్నాయని, బిల్లు కట్టాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి చేసి, భయపెట్టి వేలకు వేలు డబ్బులు కట్టించుకున్నారు. మండలంలోని రెడ్డి గణపవరం, కొయ్యలగూడెంలోని కొన్ని గ్రామాలలో కొంతమంది అధికారుల బెదిరింపులకు రూ.15 వేలు, రూ.20 వేలు, రూ.40 వేలుకట్టారు. కొంత మంది కట్టకపోయేసరికి ఒత్తిడి చేసి మీటర్లు పట్టుకెళ్లిపోయారు. గతంలో ఈ సమస్యపై కెవిపిఎస్ ఆధ్వర్యాన ప్రజలను కదిలించి స్థానికంగా ఆందోళన చేసి ప్రభుత్వాధికారులు, రాష్ట్ర మంత్రి, ఇంధనశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చెస్తామని హెచ్చరించారు. మీడియా కూడా సమస్యపై స్పందించడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యుత్ అధికారులను పట్టుకెళ్లిపోయిన మీటర్లని తిరిగి బిగించమని చెప్పి ఆదేశాలు ఇచ్చారు. ఈనెల 4వ తేదీన విద్యుత్ అధికారులు వచ్చి మీటర్లు బిగించారు. ఈ సందర్భంగా అధికారులకు, మీడియాకి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ హృదయపూర్వక ఉద్యమాభినందనలు తెలిపారు. మీటర్ బిగించిన బాధితుల్లో బర్ల ప్రశాంతి, నేమవరపు సీత, కొల్లి విమల, బల్లి రమాదేవి, కొల్లి బుచ్చమ్మ, ఇండిబిగింజ లక్ష్మి ఉన్నారు.

భీమడోలులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన నేతలు

ఆశ్రం హాస్పిటల్‌లో ఇంజక్షన్ శిక్షణ తరగతులు

ఆశ్రమ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజరాజన్

ఏలూరు సిటీ : ఆశ్రమ హాస్పిటల్స్‌లో హెల్త్ కేర్ నిపుణుల భద్రత కోసం బిడి కంపెనీ వారి సహకారంతో నర్సింగ్, టెక్నికల్ సిబ్బందికి భద్రమైన ఇంజక్షన్ శిక్షణా తరగతులను ఇవ్వడం జరిగిందని ఆశ్రమ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్.రాజరాజన్ శుక్రవారం ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల పద్ధతుల్లో రోగులకు క్షేమకరమైన విధంగా ఇంజక్షన్ ఇవ్వడం వంటి ఆధునిక మెలకువలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణలో సుమారు 400 మంది హాస్పటల్ సిబ్బంది పాల్గొని వారి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం జరిగిందని మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శాంతయ్య, మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రాజు, హెచ్ఐసిసి చైర్‌పర్సన్ డాక్టర్ రవిచిత్ర కేన్, ఇతర వైద్యులు, బిడి కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

మగ ఆరోగ్య కార్యకర్తల తొలగింపును విరమించుకోవాలి : సిఐటియు

ఏలూరు అర్బన్ : వైద్య, ఆరోగ్య శాఖలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమించబడ్డ మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలనే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి ప్రసాద్, యూనియన్ నాయకులు సయ్యద్ జఫ్రుల్లా, రమణ, వేణుగోపాల్, బాలరాజులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2001, 2002 సంవత్సరంలో జిఒ నెం 217, 459 ద్వారా, 273, 1207 జిఒల ద్వారా వివిధ సంవత్సరాలలో జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియమించబడి సుమారు 15 మంది వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వీరు పనిచేస్తున్నారన్నారు. 20 సంవత్సరాల నుంచి ఉద్యోగ బాధ్యతల్లో విధులు నిర్వహిస్తూ, కరోనా సమయంలో ప్రాణాలకు సైతం తెగించి పనిచేశారని తెలిపారు. ఏనాటికైనా రెగ్యులర్ అవుతామన్న ఆశతో అర కొర వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారన్నారు. కానీ ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. వీరిని తొలగించకుండా ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖామంత్యులు, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఈ ప్రకటనలో డిమాండ్ చేశారు.

13, 14, 15 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరగబోయే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ 13న భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎన్‌ఆర్.హనుమాన్లు, నేతలు వసంతరావు, దాసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు: సిపిఎం జిల్లా 26వ మహాసభ ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్నాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఇతర నేతలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కట్టా భాస్కరరావు, పోలుకొండ నాగరాజు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ డేని విజయవంతం చేయాలి

ఎంపిడిఒ మురళీకృష్ణ

చింతలపూడి : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డేని తల్లిదండ్రులు వచ్చి విజయవంతం చేయాలని చింతలపూడి ఎంపిడిఒ మురళీకృష్ణ, ఎంఇఒ కిరణ్‌బాబు అన్నారు. శుక్రవారం చింతలపూడి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలసి పాఠశాల అభివృద్ధి గురించి చర్చించి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.

లయన్స్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

నూజివీడు టౌన్ : నూజివీడులో లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ బ్యాంకు వారికి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. నూజివీడు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, సీనియర్ లయన్స్ కృష్ణ ప్రసాద్ రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నూజివీడు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉద్యోగులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. దేశంలో రక్తం కొరత ఎక్కువగా ఉందని, యువకులు రక్తదానం గుర్తించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలని కోరారు. తాను 60 సంవత్సరాల వయసు కలిగివున్నప్పటికీ 62వ సారి రక్తదానం చేస్తున్నట్లు చెప్పారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన..

ఏలూరు అర్బన్ : స్థానిక ఆర్‌ఆర్ పేటలోని హెచ్‌డిఎఫ్ బ్యాంకు లో శుక్రవారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన దంత వైద్యులు డాక్టర్ వంశీ మాట్లాడుతూ గతంలో కంటే ప్రజల్లో రక్తదానంపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాదరావు, జిల్లా హెచ్‌డిఎఫ్‌సి క్లస్టర్ హెడ్ కళ్యాణ్ సిరీస్, బ్రాంచ్ మేనేజర్ అయినాల సత్య, పి.ఆర్‌ఒ కెవి.రమణ పాల్గొన్నారు.

'మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు'

విలేకరులతో మాట్లాడుతున్న విఆర్‌ఒలు, విఆర్‌ఏలు

ముదినేపల్లి : మామధ్య ఎలాంటి శాఖాపరమైన విభేదాలు లేవని మండల విఆర్‌ఒలు, విఆర్‌ఏల సంఘం స్పష్టం చేసింది. ఇటీవల విఆర్‌ఒలు, విఆర్‌ఏల మధ్య విభేదాలు రచ్చకెక్కిన సంగతి విధితమే. దీనిపై మండల తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ సుభాని ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విఆర్‌ఒల సంఘం అధ్యక్షుడు కె.కిషోర్ మాట్లాడుతూ తాము విఆర్‌ఏలను శాఖాపరమైన ఒత్తిళ్లకు గురి చేయటం లేదన్నారు. తమ విధులను మేమంతా కలిసి సక్రమంగానే నిర్వహిస్తున్నామన్నారు. ముదినేపల్లి రెవెన్యూలో ఉన్న ఓ ఒక పత్రికలో వచ్చిన వార్తలో వాస్తవం లేదన్నారు. మా పై పత్రికలో వచ్చిన వార్తలో ఎలాంటి నిజం లేదన్నారు. మండల విఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు వై.రాజేష్ మాట్లాడుతూ తమపై విఆర్‌ఒల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేవన్నారు. ఒకవేళ తమపై ఒత్తిళ్లు ఉంటే వాటిని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించుకుంటామన్నారు. తమ మధ్య ఎలాంటి భిన్నాభిప్రాయాలు, తారతమ్యాలు లేవని అందరం సోదర భావంతో కలిసి మెలిసి విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్ఐ రాజశేఖర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

టి.నరసాపురం : మండలంలోని తెడ్లం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. టిడిపి మండల నాయకులు బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం తెడ్లంలో ఏలూరు శంకర నేత్ర వైద్యశాల సిబ్బంది ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 52 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 18 మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని తెలిపారు.

'ప్రభుత్వ సౌకర్యాలు వినియోగించుకోవాలి'

టి.నరసాపురం : ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రభుత్వ సౌకర్యాలు వినియోగించుకొని అన్నిరంగాల్లో ఎదగాలని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం హెచ్‌ఎం పోరిరావు ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామ్మూర్తి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న భవిత కేంద్రాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఎంఇఒ-2 కళ్యాణి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ.ఆర్.పి. సురేష్, పుష్పరాజ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పనిచేసేందుకు ఉన్నతాధికారులు పనిచేస్తున్నారని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ప్రతి శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని ఈ శుక్రవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బంది తమకు ఉందించిన సమస్యలను ఓపిగ్గా విని స్పందించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తూ ఉండేందుకు సిబ్బంది, అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలియజేశారు. ఎవరికైనా ఏ సమస్యలున్నా వెంటనే తనని సంప్రదిస్తే వాటిని పరిష్కరిస్తానని కూడా ఆయన వారికి హామీ ఇచ్చారు. జిల్లా ఎస్‌పితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా ధాన్యం కొనుగోలుకు సహకరించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ఏలూరు: వాతావరణ పరిస్థితుల రీత్యా కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రైస్‌మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి కోరారు. కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు జిల్లా రైస్‌మిల్లర్లతో స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణంలో ప్రతికూల మార్పుల కారణంగా కృష్ణా జిల్లాలో ఒక్కసారిగా పంట కోతలతో పెద్దమొత్తంలో ధాన్యం పోగు పడిందని, ఇక ధాన్యం కొనుగోలుకు సూచన మేరకు కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి రోజుకు 50 వాహనాలను, గోనె సంచులను, హమాలీలను కృష్ణా జిల్లాకు పంపించి సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు రైస్‌మిల్లర్లు సహకరించాలని కోరారు. జెసి పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 23,761 మంది రైతుల నుంచి ఇంతవరకు 1,81,418 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. వీటి నిమిత్తం రూ.369 కోట్లు రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శ్రీలత్మ, డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్.రాజు, ఉపరవాణా కమిషనర్ ఎస్.కె.కరీం, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు

ముదినేపల్లి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లో వెలసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ఈనెల ఆరో తేదీ నుంచి 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుని, కుమార్తెను చేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ దంపతులు స్వామివారి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అధికారికంగా ప్రారంభించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

షష్ఠి ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవ కమిటీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా బొంగు రవికుమార్, వేగ్గి సురేష్, శీలం శివ రమేష్, పరసా కృష్ణ, బూరుబోయిన సోమయ్య, కొల్లి సుబ్బలక్ష్మి, దూగని నాగలక్ష్మి, బెజవాడ నాగ దేవర రాధాకృష్ణ, పరసా సాయి ఉత్సవ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

వర్ధంతి కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి


ఏలూరు సిటీ : నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలను భావితరాల వారు ముందుకు తీసుకెళ్లాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పిలుపునిచ్చారు. ఏలూరు 3వ డివిజన్ నవాబ్‌పేటలో టిడిపి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతిని మరింత పెంచిన దిట్ట భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం నేటికీ అనేక మంది పేద ప్రజలను సుస్థిరత వైపుగా నడిపిస్తోందన్నారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆ ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేసిన ఎంఎల్ఎ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు తమ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న ఫాస్టర్ విజయ్‌పాల్‌ను ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అమరావతి అశోక్, జాలా సుమతి, కార్పొరేటర్ బొద్దాని అఖిల, నాయకులు జాలా బాలాజీ, బొద్దాని శ్రీనివాస్, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలో నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్‌సి వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, రిజర్వేషన్ ఫలాలను నిర్వీర్యం చేసే తీర్పును కోర్టులు ఇస్తున్నాయని, దీనిని ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత అడిషనల్ డీజీ(కేరళ స్టేట్) పూరేటి విజయానంద్, దళిత సీనియర్ నాయకులు కాకర్ల సత్యం అన్నారు. చింతలపూడి పాత బస్టాండ్, ఎండిఒ ఆఫీస్, బోయగూడెం, ఫాతిమాపురం, దేశవరం గ్రామాలలోని అంబేద్కర్ విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొన్న హైదరాబాదులో మాలల ప్రభంజనాన్ని చూసి కృష్ణమాదిగకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేపు 15వ తేదీన గుంటూరులో జరగనున్న మాలల మహాగర్జనకు ప్రతి ఒక్క మాల సైనికుడు రావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చే వరకు మన ఉద్యమం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ సైనికులు కొడుదుల రజనీకాంత్, జైపాల్ మొగపర్తి దేవ కృపావరం పాల్గొన్నారు.

చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్, ఎంపీ పుట్ట మహేష్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం చింతలపూడిలోని పాత బస్టాండ్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా ఉమ్మడి కూటమి నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చింతలపూడి పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కంభం విజయరాజు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంల ఎంపిపి రాంబాబు నాయక్, జెడ్‌పిటిసి నీరజ మోలుగుమాటి, పట్టణ అధ్యక్షులు నాగు కొప్పుల, సీనియర్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని వివిధ ప్రాంతాలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని అర్జా వారి గూడెం ఆవాస ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్ సింగ్, వైసిపి నాయకులు రామకుర్తి నాగేశ్వరరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కిరణ్ పూలమాలలు వేసి సత్కరించారు. ఘనంగా నివాళులు అర్పించారు.

టి.నరసాపురం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని రుద్రకోటరాజుగూడెం, టి.నరసాపురం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని బొర్రంపాలెంలో అంబేద్కర్ యువత ప్రధాన సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. జెడ్‌పి హైస్కూల్లో, ఎంపిపి స్కూల్లో టీచర్స్ నివాళులర్పించారు. టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వృద్ధులకు తహశీల్దార్ సాయిబాబా, ఎస్ఐ ఎం.జయబాబు, వైద్యాధికారి ఫణీంద్ర బాబు చేతులమీదుగా పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అర్జా సాగర్, రాజేష్, గుండె మహారాజు, చిన్నం బుజ్జి, అర్జున్‌రావు, గణపతి శ్రీను, మాణిక్యాలరావు, విజయ్, మునీశ్వరరావు గాంధీ పాల్గొన్నారు.


పోలవరంలో..

పోలవరం : మండలంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పోలవరం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ సాయిరాజు, సర్పంచి పొడుం పుష్ప అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యడ్లగూడెం సెంటర్లో సిఐటియు నాయకులు వారా నాని, అక్కాబత్తుల రాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో స్థానిక కాలేజీ రోడ్డు జంక్షన్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. కొత్త పట్టిసీమ గ్రామంలో గ్రామస్తులు, అంబేద్కర్ యూత్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు సొబ్బన రాజశేఖర్ బాబు, కుంజం నాగబాబు, రాంబాబు, గంగాధర్, నాగార్జున, తోర్లపాటి రాజశేఖర్ పాల్గొన్నారు.

చింతలపూడిలో..

ముసునూరు : భారతదేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న కుల వివక్షతను రూపుమాపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనుభావుడు, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని టిడిపి కార్యాలయంలో వారు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కునూరు : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి శ్లోక స్కూల్ కరస్పాండెంట్స్ మాదినేని శ్రీనివాసరావు, పిచ్చుక మనోజ్ పూలమాలలు వేసి ఆ మహానీయుడికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని, ఆయన గొప్ప రాజ్యాంగ నిర్మాత అని, బడుగు బలహీన తరగతుల అభివృద్ధి ప్రదాత అని కొనియాడారు. మనమందరం నీతి నిజాయితీలతో అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, అంబేద్కర్ జీవితమే ఒక గొప్ప నిదర్శనమని, ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని విద్యార్థులకు కరస్పాండెంట్స్ సూచించారు. ఈ కార్యక్రమంలో శ్లోక స్కూల్ యజమాన్యం పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండల కేంద్రమైన ముదినేపల్లిలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు, సోమల వర ప్రసాదరావు, దళిత నాయకులు బేతపూడి వెంకటరమణ, పాగోలు విజయసాగర్, మొవ్వ ఫణింద్ర, లేళ్ల ఆంజనేయులు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మండవల్లి : రాజ్యాంగాన్ని అనుసరించడం ద్వారానే సమ సమాజ నిర్మాణం ఏర్పడుతుందని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతరాజు, గౌరవాధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల, మత రహిత ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అంబేద్కర్ జీవితకాలం పోరాటం చేశారని కొనియాడారు. పాగొల్లు అభిశా, కొండపల్లి రవి, వరప్రసాద్ పాల్గొన్నారు.

కలిదిండి : భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా మండలంలోని మట్టగుంటలో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎ.దుర్గారావు, టి.వెంకటేశ్వరరావు, ఎం.పెంటయ్య, కె.మార్రాజు, టి.మణిబాబు పాల్గొన్నారు.

పొగాకు పంటను పరిశీలిస్తున్న ఎడి

పొగాకులో కొత్తరకం తెగుళ్లు

ఎకరానికి రూ.40 వేల వరకూ నష్టపోతున్న రైతులు

ముసునూరు : పొగాకు పంటలో కొత్తరకం తెగుళ్ల వల్ల పంటవేసిన 40, 50 రోజులు పూర్తయినా గానీ పంట దెబ్బతినే పరిస్థితి వచ్చి తెగుళ్ల ఆశిస్తున్నాయని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో పలు పొగాకు తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలోని మార్పులు ఉండటం వల్ల మొక్కలోని మువ్వ దగ్గర నల్లబడిపోవడం, వేరు కుళ్ళ తెగుళ్ళ రావడం వల్ల ఆ మొక్క పూర్తిగా చనిపోయే పరిస్థితి వస్తుందని ఈ తెగుళుకు మందులు కూడా పనిచేయలేని పరిస్థితి ఉందన్నారు. ఈ దశలో పంట చనిపోతే రైతులు ఎకరానికి వచ్చి పొగాకు నారు కొనుగోలు రూపంలో, దుక్కుల ఖర్చు, కూలీల ఖర్చు తదితర ఖర్చు రూపేణా సుమారు ఎకరానికి రూ.40 వేల వరకూ నష్టపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు వంట షెడ్డు ప్రారంభం

ముసునూరు : దాతల సహకారంతో నిర్మించిన వంట షెడ్డు ప్రారంభోత్సవానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి విచ్చేసి, ప్రారంభిస్తారని ముసునూరు టిడిపి గ్రామ నాయకులు దేవినేని వరప్రసాద్ అన్నారు. ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దేవినేని వరప్రసాద్, అతని సోదరి దేవినేని రుక్మాబాయి రూ.10 లక్షలతో నిర్మించిన వంటషెడ్, భోజనశాల ప్రారంభోత్సవం, ప్రభుత్వ కార్యక్రమైన మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమానికి కుడా హాజరవుతారని తెలియజేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

విరాళాలతో పాఠశాల చుట్టుపక్కల ఇనుప కంచె ఏర్పాటు

పాఠశాల చుట్టూ కంచె ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థులు

వేలేరుపాడు : మండలంలోని పాత పూచిరాల గ్రామంలో గల పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు కోరారు. పాత పూచిరాల గ్రామంలో ఉన్న పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థులు, ఉద్యోగస్తులు, గ్రామస్తులు అందరూ కలిసి విరాళాలతో పాఠశాల చుట్టు పక్కల ఇనుప కంచెను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్మన్ పొట్ల మోహన్, వైస్ ఛైర్మన్ బంధం వెంకట రమణ మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల పశువులు సైతం రాత్రి సమయంలో అక్కడే ఉండేయని, పరిశుభ్రత లోపించిందన్నారు. విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం ఉన్న స్కూల్ కమిటీ సభ్యులు అందరూ కలిసి గ్రామంలో ఉన్న అందరితో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి వారి సహాయ సహకారాలు అందజేశారు. దీనివల్ల పాఠశాల ఆవరణం చుట్టూ సిమెంట్ పోల్స్‌తో ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. దీనికి సహకరించిన ఉపాధ్యాయులు సుస్మితకి, గ్రామస్తులకు, గ్రామంలో ఉన్న ఉద్యోగస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా స్కూల్ ప్రగతి పథంలో ముందుకు నడిపే విధంగా ఉంటామని అన్నారు.

నగరంలో అభయ టీమ్ గస్తీ

ఏలూరు స్పోర్ట్స్ : మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు జిల్లా ఎస్‌పి ఆదేశాలపై ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అభయ మహిళా రక్షక దళ సభ్యులు నగరంలో గస్తీ నిర్వహించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా ఎస్ఐ కాంతి ప్రియ, ఏలూరు టూ టౌన్ మహిళా ఎస్ఐ నాగ కళ్యాణి జిల్లాలో ఉన్న అభయ రక్షక మహిళా దళం ఏలూరు నగరంలో గస్తీ నిర్వహించారు. ఎస్‌పి ఆదేశాలతో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీ ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలు నిరోధించడమే లక్ష్యంగా అభయ రక్షక మహిళ దళ సభ్యులు పనిచేస్తున్నారని తెలిపారు. ఆర్‌టిసి బస్సులు, కాలేజీ బస్సులలో ప్రయాణం చేస్తున్న విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆకతాయిలు మహిళలపై వేధింపులకు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సిఐ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు కాల్ చేయాలని కోరారు.

పేద ప్రజల ఆరోగ్య భద్రత మాది : మంత్రి పార్థసారధి

నూజివీడు టౌన్ : చెక్కును అందజేస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేద ప్రజల ఆరోగ్య భద్రత మాదని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మంత్రి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్‌లను బాధితులకు ఆయన అందజేశారు. 15 మంది బాధితులకు సుమారు రూ.7,38,901 విలువచేసే చెక్కులను మంత్రి కొలుసు పార్థసారథి అందజేసి, మాట్లాడుతూ బడుగు, బలహీన తరగతులకు, పేద ప్రజలకు పూర్తి ఆరోగ్య భద్రత తమ ప్రభుత్వానిదని అన్నారు. పేద ప్రజలకు కొన్ని కొన్ని రోగాలకు ఆరోగ్య శ్రీ ఉన్నప్పటికీ తెలియక ఆరోగ్య శ్రీ లేని హాస్పటల్లో వైద్యం చేసుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందజేసి అన్ని విధాలుగా ఆదుకొని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదని మంత్రి అన్నారు. గత 4 నెలల క్రితం వైద్యం చేసుకున్న ప్రతిఒక్కరూ సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చు అని మంత్రి తెలిపారు. పేద ప్రజలు డబ్బులు లేక వైద్యానికి దూరం అవ్వకూడదని, అన్ని రకాల రోగాలను ఆరోగ్య శ్రీలో ప్రభుత్వం పొందుపరిచామని, దాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి తుంగలో తొక్కిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక్క చెక్కును కూడా పేద ప్రజలకు అందజేయలేదని ఎద్దేవ జేశారు. పేద ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేరుస్తున్న ప్రభుత్వం తమదని తెలిపారు.

ఆగిరిపల్లి : బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా వుంటుందని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలో ఇటీవల వచ్చిన తుపాన్ కారణంగా వరదల్లో నాగ వీర్రాజు కొట్టుకొని పోయి మృత్యువాత పడటంతో నిరాశ్రయులైన ఆ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును ఆయన నాగ వీర్రాజు భార్య నాగ కాసులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగ వీర్రాజు కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడల్లో మండలానికి గుర్తింపు తేవాలి

రాయల్ క్లబ్ ఫౌండర్ చిక్కాల నాగేశ్వరావు

చింతలపూడి : క్రీడల్లో మండలానికి మంచి పేరు తీసుకురావాలని రాయల్ క్లబ్ ఫౌండర్ చిక్కాల నాగేశ్వరావు, అధ్యక్షులు ఊసా సుబ్బారావు అన్నారు. భువనేశ్వర్‌లో 'డిస్కస్ త్రో'లో జూనియర్ నేషనల్స్ ఆడటానికి వెళ్తున్న బికాం 2వ సంవత్సరం చదువుతున్న గోల్కొండ నీలిమకి చింతలపూడి రాయల్ క్లబ్ ద్వారా రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సెక్రటరీ కురిశెట్టి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 167/2023
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
పజ్జూరి హిమబిందు అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు
సమన్స్2
D-1: పజ్జూరి హిమబిందు, W/o. ప్రసాద్, డోర్ నెం. 3-106, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప.గో॥జిల్లా.
D-2: వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, డోర్ నెం. 4-129, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప.గో॥జిల్లా.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 11-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప.గో॥జిల్లా
ది. 06-12-2024 సెల్: 98662 59514

IN THE COURT OF THE MACT CUM CHIEF JUDGE: CITY CIVIL COURTS AT :: HYDERABAD
M.V.O.P. No. 1401 of 2024
Between:
T. Ramya & others ....Claimants
AND
T.S.R.T.C & anothers
...Respondents/Respondents
NOTICE
To
Venkateswara Rao, S/o. P.Ramana, aged: Major, Occ: Driver, R/o. TSRTC 2nd Ward, Kovuru, West Godavari- 534350. (Driver of the RTC Bus bearing no AP-28-Z-1886.
(Respondent No.3)
Please take notice that the above-named claimant have filed the case against you for grant of compensation on account of death of late T. Kishore in a motor vehicle accident.
That the above case is posted to 17-12-2024 at 10.30 a.m., for your appearance. If you fail to attend before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absence, as per law.
(BY ORDER OF THE COURT)
T. VISHWARUPA CHARY
ADVOCATE
101, 1st Floor, Harikrishna Residency, H.No.11-10-1/A, Vijayapuri Colony, Road No. 1, Kothapet, Hyderabad- 35.

G.T.P. COLLEGE OF EDUCATION FOR WOMEN
(Approved by NCTE & Affiliated to Adikavi Nannaya University)
Dirusumarru Road, BHIMAVARAM - 534 201, W.G. Dt., (A.P.)
Phone No. : 08816-233455 Website: www.gtpcollege.org
ADMISSION INTO B.Ed. "B" CATEGORY & "A" CATEGORY SPOT SEATS
Applications are invited from the eligible candidates for B.Ed course Under Management Quota & Spot admission for the Academic year 2024-2025.
College Status : Non Minority
Intake : 50
COLLEGE VACANCY POSITION :
Category A Left over Seats (Spot) : 22 + 5 (EWS)
Category B Seats Under Management Quota : 12
Eligibility : Bachelor Degree or P.G with 50% Marks for OC, and 40% for BC, SC,ST with or without Ed.Cet-2024.
Photo Copies : SSC, Intermediate Marks, Degree or P.G Marks Lists.O.Ds, Study Certificates(10th to Degree) and Caste Certificate, TC should be submitted to the college office by Personally between 10.00 A.M. to 4.00 P.M. on or before 13-12-2024.
Cell : 98483 81071, 83318 51214, 98482 33933
MENTEY RAM MANOHAR, B.E. Secretary & Correspondent

UMA EDUCATIONAL & TECHNICAL SOCIETY
B.ED.SE (HEARING IMPAIRMENT), ELURU
(Recognized by RCI, New Delhi, Affiliated by Adikavi Nannayya University)
Parivarthan Spl. School for the Hearing Impaired
Datta Ashram Road, Srinagar, 2nd Lane, Santivarapupeta, Eluru - 534003
Ph. No.08812-222295, 9491220349, 9948600642
ADMISSION B.ED.SE(ID) "B" CATEGORY & "A" CATEGORY SPOT SEATS
Applications are invited from the eligible candidates for B.Ed. Special Education (HI) Course under Management Quota & Spot Admission for the year 2024-25.
College Status : Non-Minority
Intake : 30
College Vacancy Position
Category A Left over Seats (Spot) : 23 + 3 (EWS)
Category B Management Quota : 7
Eligibility: Bachelor Degree or P.G. with 50% Marks for OC, 40% Marks for BC, SC, ST with or without Ed.Cet-2024.
Photo Copies: SSC, Intermediate Marks, Degree or PG Marks Lists, O.D.s, Study Certificates and Caste Certificates, TC should be submitted to the College Office by personally between 10 AM to 4 PM on or before 13-12-2024.
- S.P. Reddy, Executive Director and Correspondent

పురపాలక సంఘ కార్యాలయం, జంగారెడ్డిగూడెం
ఆర్.ఓ.సి.నెం. /2024/ఎ1 తేది.06-12-2024
ప్రకటన
స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్రాలో బాగంగా మన జంగారెడ్డిగూడెం పట్టణాన్ని స్వచ్ఛ ఆరోగ్య జంగారెడ్డిగూడెంగా మార్చుటానికి ప్రయత్నంలో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన చేయకూడదని అలా చేసిన ఎడల 100/-రూపాయలు జరీమాన విదించబడునని కమీషనర్ జంగారెడ్డిగూడెం పురపాలకసంఘం వారు ఆదేశించియున్నారు.
కమీషనరు,
జంగారెడ్డిగూడెం పురపాలక సంఘము